క్లుప్తంగా


పరామర్శ

రామచంద్రాపురం: మండలంలోని పీవీపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, చిట్టత్తూరు దళితవాడకు చెందిన నాగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి ఆయా గ్రామాలకు చేరుకుని వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి తుడా : క్రికెట్‌పై ఆసక్తి కలిగిన క్రీడాకారులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్యాస్ట్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం ఎఫ్‌ఎఫ్‌సీఏ సమ్మర్ క్రికెట్ కోచింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రారంభమైన సమ్మర్ క్యాంపును సందర్శించారు. క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు.

మారుతి ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స



తిరుపతి తుడా : స్థానిక శ్రీ మారుతీ హాస్పిటల్‌లో ఓ మహిళకు అరుదైన ఊపిరితిత్తుల శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ ఆదివారం తెలిపారు. ఆమెకు ఎక్స్‌రే, సీటీ స్కాన్ పరీక్షలు చేయగా ఎడమపక్క ఊపిరితిత్తి మార్గం పూర్తిగా మూసుకుపోయినట్టు గుర్తించామన్నారు. తాంబూలంలో ఉపయోగించే వక్క వల్ల అలా జరిగిందని తెలిపారు. బయోస్కోపీ ద్వారా వక్కను విజయవంతంగా తొలగించినట్లు చెప్పారు. 'బెలూన్ డిలటేషన్' అనే నూతన విధానం ద్వారా ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం మహిళ కోలుకొని సాధారణ స్థితికి వచ్చినట్లు చెప్పారు. తమ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యసేవలను సాధారణ ఖర్చుతో అందిస్తున్నట్లు చెప్పారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ నరసింహ వైద్యుల బృందం ఈ అరుదైన శస్త్రచికిత్సను చేసినట్టు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ అమ్మను గౌరవించాలి



నర్సును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి తుడా : సృష్టికి మూలమైన అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించి ప్రేమించాలని ఎమ్మెల్సీ, రష్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. రష్ ఆసుపత్రిలో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో తల్లికి మించిన దైవం లేదన్నారు. సీనియర్ హెడ్ నర్స్‌లను సత్కరించారు. డాక్టర్లు మౌన కీర్తిసాగర్ రెడ్డి, మొగిలేశ్వరి, సాయిసౌమ్య, గీతిక, లీలావతి, బాబు, సుమతి, నర్సులు రోజ, రేష్మా, చందన, రమ్య, గాయత్రి, మేనేజర్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లె 72వ మహా భారత ఉత్సవాల్లో ఆదివా రం సాయంత్రం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఈ సందర్భంగా ద్రౌపది స మేత ధర్మరాజులు స్వామివారిని ప్రత్యేకంగా అ లంకరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయ దాతలు రాగంశెట్టి భూషణ వ్యవహరించారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

- ఇద్దరు మహిళల మృతి

తిరుమల : శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఘాట్ రోడ్డు మలుపులో చేసిన ఓ పొరపాటుతో ఇద్దరు మహిళల మృతికి కారణమైంది. తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య కథనం మేరకు.. అనంతపురం జిల్లా, రాయదుర్గానికి చెందిన భక్తులు సుమోలో తిరుమలకు చేరుకుని ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం మొదటి ఘాట్ రోడ్డులో కిందకు దిగుతుండగా 24వ మలుపు వద్ద ఓ శిలపై శ్రీవారు, అంజినేయస్వామి, అమ్మవారి విగ్రహాలు చెక్కి ఉండడాన్ని భక్తులు గమనించారు. ఇంతలో సుమోలో నుంచి రేణుకమ్మ(24) అనే మహిళ కిందకు దిగి నడుచుకుంటూ ఆ మలుపు వద్దకు వెళ్లి విగ్రహాలకు నమస్కరిస్తుండగా.. ఇంతలో తెలంగాణ మెదక్‌కు చెందిన తుఫాన్ వాహనంలో 15 మంది భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొదటి ఘాట్ రోడ్డులో కిందకు దిగుతున్నారు. ఈ క్రమంలో వాహన చోదకుడు మలుపు వద్ద అకస్మాత్తుగా స్వామివారికి నమస్కరిస్తున్న రేణుకమ్మను చూసి వాహనాన్ని అదుపు చేయలేక ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రేణుకమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. తుఫాన్ వాహనం వేగంగా ముందుకు వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తుఫాన్ వాహనంలో ప్రయాణిస్తున్న పార్వతి(72) కూడా మృతి చెందింది. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాహిమాం పరమేశ్వరి..

- వేడుకగా గంగ జాతర
- భక్తజనంతో కిక్కిరిసిన ఆలయం
- ఇంటింటా పూజలందుకున్న మాతంగులు



విశేషాలంకరణలో గంగమ్మ



అమ్మవారి దర్శనం కోసం ఆలయం వద్దకు తరలివచ్చిన భక్తులు



ఆకట్టుకుంటున్న సప్పరాలు



భక్తులకు అంబలి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ డాక్టర్ ఆరణి సంధ్య

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఐదవ రోజు ఆదివారం అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కరుణించి కాపాడు తల్లీ అంటూ మొక్కుకున్నారు. కైకాల కులస్తులు మాతంగి వేషం ధరించి నగరంలో పూజలు అందుకున్నారు. స్థానికులు సైతం మాతంగితోపాటు వివిధ జానపద, స్త్రీ వేషాలు ధరించి డప్పుల దరువుల మధ్య చిందులు వేస్తూ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుమార్తె భూమన నీహా దుర్గ వేషధారణతో అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు సున్నపు కుండల వేషాలు, సప్పరాలు

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో ఆరవ రోజు సోమవారం ఇద్దరు కైకాల కులస్తులు సున్నపు కుండల వేషాలు ధరిస్తారు. వీరు పెద్దగంగమ్మ, చిన్నగంగమ్మకు ప్రతీకలుగా ప్రతి ఇంటా పూజలు అందుకుంటారు. భక్తులు సప్పరాలు ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు.

నేటి అర్ధరాత్రి గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలతో శాంతి

అమ్మవారి జాతర చాటు మొదలు మాతంగి వేషం రోజు వరకు విభిన్నరీతుల్లో వేషధారణలతో అలసిన గంగమ్మను శాంతింపజేసేందుకు సోమవారం అర్ధరాత్రి 12.15 గంటలకు ప్రత్యేక అభిషేకం చేస్తారు. అనంతరం అర్చకులు అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

గంగమ్మకు సారె సమర్పణ

తిరుమల: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం తిరుమల మీడియా ప్రతినిధులు అమ్మవారికి సారె సమర్పించారు. కళాబృందాలతో మధురానగర్ నుంచి ఊరేగింపుగా వచ్చిన మీడియా ప్రతినిధులకు ఆలయం వద్ద ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సూరా మోహన్ ప్రసాద్, లక్ష్మీకాంత్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, చిన్నంగారి మురళి, శ్రావణ్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మకు పూజలు

తిరుపతి తుడా : స్థానిక ఎమ్మార్ పల్లి 19వ డివిజన్‌లోని నడివీధి గంగమ్మతోపాటు గంగ జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద కార్పొరేటర్ డాక్టర్ ఆరణి సంధ్య ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అంబలి పంచిపెట్టారు. డివిజన్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు ఆత్మీయ విందు ఏర్పాటుచేశారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మీడియా ప్రతినిధులు



మాతంగి వేషంలో యువకులు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

మహిళలకు చీరల పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తమ్ముడు గణేష్, వైఎస్సార్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: గంగమ్మ జాతర సందర్భంగా లక్ష్మీపురం సర్కిల్లో ప్రతిష్టించిన అమ్మవారి ప్రతిమకు ఆదివారం కార్పొరేటర్ తమ్ముడు గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అంబలి పంపిణీ, అన్నదానం చేశారు. 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మూడవ వార్డు అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, కార్యదర్శి కుమార్, సోమశేఖర్‌రెడ్డి, పాండు, రాజేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

భక్తులకు అంబలి..



ఆటో కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుచానూరు (చంద్రగిరి): దామినేడు ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలోని ఆటో స్టాండ్ వద్ద ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తిరుపతి గంగజాతర సందర్భంగా కాలనీ ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఏఐటీయూసీ చంద్రగిరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆటో డ్రైవర్లకు బట్టలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తిరుచానూరు పంచాయతీలో సుమారు 500 మందికి పైగా ఆటో కార్మికులు ఉన్నారని, వారికి అండగా ఏఐటీయూసీ యూనియన్ సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్‌రెడ్డి, దయానంద్, సుబ్రహ్మణ్యం పిళ్లై, వాసు, వెంకీ, దాము, సురేష్, శ్రీనివాసులు, లక్ష్మి, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన నిర్వహించనున్నట్టు కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు 0877–2227208కి కాల్ చేసి సమస్యలు తెలపవచ్చని తెలిపారు.

వేడుకగా హనుమాన్ జయంతి



హనుమంతుడికి పూజలు చేస్తున్న చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం నిర్వాహకులు



ఆంజనేయస్వామికి పాలాభిషేకం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ప్రతాప్ స్వామిజీ

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయానికి ఎదురుగానున్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీసీతారామలక్ష్మణస్వామి ఉత్సవమూర్తులను శ్రీఆంజనేయస్వామి ఆలయానికి వేంచేపు చేశారు. అక్కడ అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీకోదండరామాలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి శ్రీఆంజనేయస్వామివారికి వస్త్రం సమర్పించారు. రాత్రి 7 నుంచి హనుమంత వాహనసేవ వైభవంగా నిర్వహించారు. అలాగే రాములవారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం, అన్నప్రదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు, సీవీ.రమణరావు, ఎంఎస్.విశ్వనాథం, పుష్ప, రాజ్యలక్ష్మి, సరిత, రవికుమార్, వెంకట గాయిత్రి సేవా సమితి ప్రతినిధి సీఆర్‌కే.శేషగిరిరావు, బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్‌లో..

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో ఆదివారం హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలోని అభయ ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచులు సీవీ రమణ, సెల్వం, రవి పాల్గొన్నారు. పేరూరు, చెర్లోపల్లి, కాలూరులోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రగిరి ఉగ్ర ప్రత్యంగిరా కాళీపీఠం ఆలయ సమీపంలోని పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 1,116 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. చంద్రగిరి పట్టణంలోని కోట సమీపంలో ప్రసన్న ఆంజనేయ స్వామికి విశేష పూజలు చేశారు. శ్రీవారి మెట్టు సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేశారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, నెత్తకుప్పంలోని వానర వనంలోని ఆంజనేయస్వామి, శ్రీ శక్తి పీఠంలోని మలయాళ ఆంజనేయ స్వామి, కుప్పంబాదూరులోని ప్రసన్నాంజనేయస్వామి, రాయలచెరువుపేట సమీపంలోని శ్రీ శనైశ్చర ఆలయంలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

దోర్నకంబాలలో గడ్డివాము దగ్ధం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం దోర్నకంబాలలో ఆదివారం మధ్యాహ్నం గడ్డివాము కాలిపోయింది. చెంచు అనే వ్యక్తి పశువుల మేత కోసం గ్రామ శివారులో గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం ఉన్నట్లుండి గడ్డివాములో మంటలు చెలరేగడంతో గ్రామస్తులు వాటిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. వీలుకాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. తిరుపతి నుంచి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. చంద్రగిరి మండలం శానంబట్లలో జరుగుతున్న మిస్టరీ మంటల నేపథ్యంలో దోర్నకంబాలలో అదే తరహాలో మంటలు చెలరేగడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాలిపోతున్న గడ్డివాము

ఘనంగా చిల్లీస్ రెస్టారెంట్ వార్షికోత్సవం

- కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు సరుకులు పంపిణీ చేస్తున్న కమిషనర్ డి.హరిత, రెస్టారెంట్ అధినేత అంజి

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం ఎయిర్ బైపాస్ రోడ్డులోని టీవీఎస్ షోరూం సర్కిల్ సమీపంలోని చిల్లీస్ రెస్టారెంట్ వద్ద ఆదివారం రెస్టారెంట్ 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత ముఖ్య అతిథిగా హాజరై పారిశుద్ధ్య కార్మికులు, నవజీవన్, అభయ క్షేత్రం, అక్షయ క్షేత్రం, మాతృశ్రీ, పాస్ మనోవికాస్ కేంద్రం, అనాథ ఆశ్రమాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ రెస్టారెంట్ ద్వారా పలువురికి ఉపాధి కల్పించడమేకాక రుచికర ఆహార పదార్థాలను అందజేస్తూ ప్రజాదరణ పొందడం అభినందనీయమన్నారు. రెస్టారెంట్ అధినేత అంజి మాట్లాడుతూ తమకు వచ్చే ఆదాయంలో కొంత సొమ్మును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. భవిషత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు. చిల్లీస్ రెస్టారెంట్ అధినేత అంజికి పలువురు స్నేహితులు, శ్రేయాభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

అపూర్వ కలయిక



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91వ బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు సంజీవరాయులు, సుబ్బారామ నాయుడు, వెంకటరమణారెడ్డి, ప్రమీల, అటెండర్ బాలయ్యను ఘనంగా సన్మానించారు.